సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



జిల్లా ఆస్పత్రి తనిఖీ

మదనపల్లె జిల్లా ఆస్పత్రిని కేంద్ర బృంద సభ్యులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్‌సీ). నుంచి సభ్యులు వచ్చారు. -IIలో



భర్త వేధింపులతో ఆత్మహత్యాయత్నం

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 313 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	575	575
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 61.200 కిలోలు



న్యూస్‌రీల్

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా చంద్రశేఖర్

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా డాక్టర్.వి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణ బాబు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఈఎన్‌టీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు.

పీజీ కోర్సుల ప్రారంభం

మదనపల్లె: పట్టణంలోని బెసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో నిలిచిపోయిన పీజీ కోర్సులను ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి పునఃప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.ఆనందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు బదిలీపై వచ్చినందున ఈ ఏడాది నుంచి పీజీ కోర్సులను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎస్వీయూ వెబ్‌సైట్‌లో ఆప్షన్లు పెట్టుకుని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెరుగైన సేవలను అందించాలి

రాయచోటి అర్బన్: ఆర్టీసీ అధికారులు,ఉద్యోగులు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించాలని ఆర్‌టీసీ జోన్-4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఆర్టీసీ బస్టాండులో జరుగుతున్న నూతన గదుల నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం డిపో అధికారులు, ఉద్యోగులు,సిబ్బందితో గేట్ మీటింగ్‌ను నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ ఈఈ ఎస్.వెంకటరమణ ,డిపిటిఓ పి.రాము,డిఈ పోతురాజు డిఎం ధనుంజయ పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమమే లక్ష్యం'

రాజంపేట రూరల్: రైతులకు సంక్షేమ పథకాల అమలులో ఆర్‌బీకేల సిబ్బంది ముందుండాలని జిల్లా డీఏఓ చంద్రనాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని తాళ్లపాక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే)ను బుధవారం జిల్లా డీఏఓ చంద్రనాయక్ సందర్శించారు. గ్రామంలో ఆర్‌బీకే సిబ్బంది నమోదు చేసిన ఈ క్రాప్ బుకింగ్ సక్రమంగా చేశారో లేదో తనిఖీ చేశారు. ఈ నెల చివరిలోపు ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మండల ఇంచార్జీ ఏఓ సాగరిక పాల్గొన్నారు.

'పంట సాగుకు ప్రోత్సాహం'

రాజంపేట రూరల్: ప్రత్యామ్నాయ ఉద్యానపంటగా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ ద్వారా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఉద్యానశాఖ జిల్లా అధికారి రవిచంద్ర బాబు తెలియజేశారు. స్థానిక డివిజనల్ రైతు శిక్షణ కేంద్రంలో ఉద్యానశాఖ, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఆధ్వ ర్యంలో రాజంపేట, నందలూరు, పెనగలూరు ఆర్‌బీకేల సిబ్బందికి బుధవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజంపేట, నందలూరు, పెనగలూరు, కోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లి మండలాల పరిధిలో 100 హెక్టారులలో పంట సాగు లక్ష్యాన్ని కేటాయించారని తెలియజేశారు. ఉద్యానశాఖ స్వదేశీ రకానికి హెక్టారుకు రూ.20 వేలు, దిగుమతి రకానికి హెక్టారుకు రూ. 28 వేలు రాయితీని కల్పిస్తుందని తెలియజేశారు. ఈ సాగును ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బిందు సేద్య పరికరాలు కూడా అందజేస్తుందని తెలియజేశారు.

స్వేచ్ఛా జీవులం
సెల్లో ఖైదీలం

▸ మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన పదహారేళ్ల బాలిక పుస్తకాల కంటే సెల్‌ఫోన్‌లోనే ఎక్కువగా గడిపేది. రానురానూ అదొక వ్యసనంగా మారింది. 'ఏంటమ్మాయ్ ఎప్పుడూ ఫోనేనా..' తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

▸ కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ సాయిబులపల్లెకు చెందిన పద్దెనిమిదేళ్ల అమ్మాయి కాలేజీకి సక్రమంగా వెళ్లకుండా వచ్చింది. ఎప్పుడు చూసినా చేతిలో సెల్లుతోనే కనిపించేది. ఓ రోజు తల్లిదండ్రులు దండించారు. దీంతో ఆ బాలిక ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది.

ఇలా ఒకరిద్దరు కాదు... దాదాపు 90 శాతానికి పైగా చిన్నారులు, యువత సెల్లుతోనే గడుపుతున్నారు. ఇన్‌స్టాలు.. రీల్సు అంటూ సోషల్ మీడియాను వ్యసనంగా మార్చుకున్నారు. పెద్దలు దండించినప్పుడు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.



- సెల్‌ఫోన్‌కు బానిసవుతున్న యువత
- గంటలకొద్దీ గడిపేస్తున్న వైనం
- ఆందోళనలో తల్లిదండ్రులు

మదనపల్లె సిటీ: కాలం మారింది. దేశ భవిష్యత్తు నిర్మాణం జరిగే తరగతి గదిలోనూ అనేక మార్పులు జరిగాయి. బ్లాక్‌బోర్డు స్థానంలో స్క్రీన్‌లు దర్శనమిస్తున్నాయి.. పిల్లలు చేతిలో పుస్తకాలకు బదులుగా మొబైళ్లు, ట్యాబులు పలకరిస్తున్నాయి. అతి అనర్థాలకు మూలం అన్నట్లు యువత సెల్లును దుర్వినియోగం చేస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసులకే పరిమితం చేయాల్సిన సెల్లును సొల్లు కబుర్లతో.. చాటింగులతో కాలక్షేపం చేస్తున్నారు. విజ్ఞానం కోసం కాకుండా వినోదం కోసం వినియోగిస్తున్నారు. పైగా వివిధ మాధ్యమాల్లో ఫొటోలు పెట్టడం, అపరిచితులతో ప్రేమ వ్యవహారం, అశ్లీల చిత్రాలు చూడటం, సైబర్ నేరాల దాడులకు గురవుతున్నారు. ఫలితంగా వ్యసనంగా మార్చుకుని బానిసలవుతున్నారు. చుట్టూరా మంది ఉన్నా.. ఇంటికి బంధువులొచ్చినా 'సెల్లో బందీలు'గానే మారుతున్నారు. ఉన్నట్లుండి నవ్వడం... చూస్తూ చూస్తూ ఏడ్వడం చేస్తూ నలుగురిలో ఏకాకిలా మిగులుతున్నారు.

పరిమిత సమయమే మేలు:

పిల్లల అల్లరి భరించలేక వారి చేతికి తల్లిదండ్రులు సెల్‌ఫోన్ ఇస్తూ అలవాటు చేస్తున్నారు. ఇది శ్రేయస్కరం కాదని చెబుతున్నారు మానసిక, వైద్య నిపుణులు. వారితో సరదాగా ఆటపాటలతో గడపాలని. జ్ఞానాన్ని పెంచే సంగతులు చెప్పాలని సూచిస్తున్నారు. ఫోన్ వారి చేతికి ఇవ్వాల్సి వస్తే చదువులకే పరిమితం చేయాలి. విజ్ఞానం వెనులుబాటు కల్పించడం ఉత్తమమని చెబుతున్నారు. యువత ఆన్‌లైన్ క్రీడలు ఆడడానికో... అశ్లీల దృశ్యాలు చూడడానికో గంటల తరబడి చాటింగ్‌కో అలవాటు పడుతున్నారు. ఇలాంటి కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు. పుస్తకాలు చదవడం, ఆటలు, వ్యాయామం, యోగా, మానసిక ఉల్లాసం కలిగించే అంశాలపై దృష్టి మరల్చాలని వివరిస్తున్నారు.

ఉపాధ్యాయులకు కష్టంగా మారింది

పూర్వకాలంలో దండనతో కూడిన విద్య ఉండేది. ఉపాధ్యాయులు, సంఘం పెద్దలు అంటే విద్యార్థుల్లో ఓ రకమైన భయం ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తల్లిదండ్రులే అతిగారాబం చేస్తున్నారు. పిల్లలు ఎలాంటి తప్పిదాలు చేసినా ఉపాధ్యాయులు కఠినంగా వ్యవహరించే పరిస్థితి లేదు. పైగా తరగతి గదిలో టీచర్లనే ఆటపట్టించే విద్యార్థులూ తయారవుతుండడం బాధాకరం. ఫలితంగా పలు ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ఆకతాయితనాన్ని భరించలేక ఉపాధ్యాయినులు బోధనకు దూరమయ్యే సంఘటనలూ చోటుచేసుకుంటున్నాయి. ఇది సమాజానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక చిన్నపాటి మందలింపు చేసినా పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం పరిపాటిగా మారింది.

▸▸ అతిగా చూస్తే ఆరోగ్య సమస్యలు

సెల్‌ఫోన్‌లు విపరీతంగా చూస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లల్లో కళ్లు పొడిబారడం, మసక, ఇన్‌ఫెక్షన్ ఎక్కువ వస్తాయి. సెల్‌ఫోన్ రేడియేషన్ , కాంతుల ప్రభావంతో చూపు దెబ్బతినే ప్రమాదం ఉంది. దగ్గరుంచి ఫోన్ చూడడం వల్ల రెటీనా పొరపై ప్రభావం పడి దృష్టి మందగిస్తుంది. అత్యవసరమైన ఫోన్లు చూడాల్సి వస్తే 5 నిమిషాలు తర్వాత 20 సెకన్ల పాటు విరామం ఇవ్వాలి.



పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి



పిల్లలు టీనేజీలోకి రాగానే వారిలో కొత్త మార్పులు, ఆలోచనలు వస్తుంటాయి. ఆ దశలో తల్లిదండ్రులు వారికి మిత్రులుగా వ్యవహరించాలి. ప్రత్యేకంగా చదువుపై దృష్టి పెడుతున్నారా, లేదా ఒంటరిగా ఉంటున్నారా అనేది గమనించాలి. వారికి ప్రత్యేక గదిని కేటాయించకపోవడం ఉత్తమం. వారితో పాటు నాన్నమ్మలు, అమ్మమ్మలు, తాతలు దగ్గర ఉండేట్లు చూసుకోవాలి. మొదట్లో సమస్యను గుర్తిస్తే పరిష్కార మార్గం కనిపిస్తుంది.

–చాముండేశ్వరి, మానసిక వైద్య నిపుణురాలు,మదనపల్లె

తల్లిదండ్రులదే బాధ్యత



పిల్లలను చక్కదిద్దే బాధ్యత తల్లిదండ్రులు స్వీకరించాలి. సెల్‌ఫోన్ ముట్టుకోవడానికి వీల్లేదని ఆంక్షలు విధిస్తే ..ఎలాగైనా చూడాలని పిల్లలు తపన పడే ప్రమాదం ఉంది. అందుకే స్నేహపూర్వకంగా మెలిగి ఫోన్ ఇచ్చినా కొద్ది సేపయినా విజ్ఞానం పంచే అంశాలు చూసేలా పర్యవేక్షించాలి.

–బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కాలేజి, మదనపల్లె

జిల్లా అంతటా ప్రత్యేక
సదరం శిబిరాలు

- డీసీహెచ్ డేవిడ్ సుకుమార్

రాజంపేట: జిల్లా అంతటా దివ్యాంగుల ధ్రువీకరణపత్రాలు జారీ కోసం ప్రత్యేక సదరన్ శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యవిధానపరిషత్ డీసీహెచ్ డేవిడ్ సుకుమార్ అన్నారు. బుధవారం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో ఏర్పాటుచేసిన సదరన్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్లాట్‌బుక్ చేసుకున్నవారికే కాకుండా, స్లాట్ బుక్ చేసుకోలేకపోయినవారికి ఈ ప్రత్యేక సదరన్ క్యాంప్ నిర్వహించామన్నారు. సులభతరంగా దివ్యాంగులకు ధృవీకరణపత్రాల జారీ కోసం పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టరు గిరీషా పీఎస్ ఆదేశంతో నిర్దేశించిన తేదిల్లో జిల్లాలోని ప్రాంతీయవైద్యశాలలో ప్రత్యేక సదరన్ క్యాంపులు నిర్వహించామన్నారు. బుధవారం , శుక్రవారంరోజులలో పీలేరు, రాయచోటి, రాజంపేట, గురు, శనివారం మదనపల్లెలో సదరన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ కొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో రాజంపేట ప్రాంతీయవైద్యశాల డా.పీవీఎస్‌రాజు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సీహెచ్‌కృష్ణతో పాటు వైద్యవిధానపరిషత్, వైద్య ఆరోగ్యశాఖ కు సంబంధించి వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదరం క్యాంప్‌ను ప్రారంభిస్తున్న డీసీహెచ్ డేవిడ్ సుకుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో కొండయ్య

అర్హులందరికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎమ్మెల్యే
- హాజరైన కలెక్టర్, ఆర్డీఓ

పెనగలూరు: ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ప్రభుత్వవిప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం పెనగలూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ సచివాలయాలు ద్వారా ఇప్పటికే ప్రతి పథకమూ అర్హులందరికీ అందుతోందన్నారు. గ్రామస్థాయిలో చిన్న చిన్న అంశాలు ఏవైనా జిల్లా అధికారుల దృష్టికి రానివి, బయటకు చెప్పుకోలేనివి ఉంటే నేరుగా ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ జిల్లా అధికారులతోపాటు పాలకులను కూడా మీ వద్దకే పంపించడం జరిగిందన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే 1902 టోల్ ఫ్రీకి చేసి తెలుపవచ్చన్నారు. ముఖ్యంగా కట్టావారిపల్లి పంచాయతీ, మల్లాలమ్మ దిన్నె ప్రజల సమస్యలను కూడా పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ బాలు మోహనమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కొరముట్ల, కలెక్టర్ గిరీషా

స్థానిక సమస్యల పరిష్కారానికే స్పందన: కలెక్టర్

స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం చేసుకునేందుకే మండలస్థాయిలో స్పందన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధ, శుక్రవారం నాడు ఒక్కొక్క మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపా రు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన శాఖకు బదిలీచేస్తున్నామని, ప్రతిశాఖకు సంబంధించిన అర్జీలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మండల వైస్ ప్రెసిడెంటు విజయ్ రెడ్డి మాట్లాడారు. పెనగలూరు, ఓబిలి, కొత్తపల్లి, వెలగచర్ల తదితర గ్రామాలకు చెందిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, జిల్లా,మండల స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, పెనగలూరు ఉపసర్పంచ్ చిన్నవెంగల్ రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల సమస్యలు తెలియజేయండి

రాయచోటి: జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆయా రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఓటర్ల జాబితా పరిశీలనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పులు తదితర సమస్యలపై వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తయ్యిందన్నారు. మరణం, బదిలీ, రిపీటెడ్ ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించామన్నారు. జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి అందిన సూచనలు, ఫిర్యాదులను పక్కాగా పరిశీలన చేస్తున్నామన్నారు. రాజకీయ ప్రతినిధులందరూ తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో మొత్తం 1577 పోలింగ్ స్టేషన్లు, 1577 బీఎల్‌ఓలు ఉన్నారన్నారు. ఓటర్లకు సంబంధించి 6,68,552 మంది పురుషులు, 6,85,071 మహిళలు, 136 ఇతరులు మొత్తం 13,53,759 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళీ, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీమాంక్‌ను సందర్శించిన కేంద్ర బృందం



సీమాంక్ సెంటర్‌ను సందర్శించిన కేంద్రబృందం

రాజంపేట: రాజంపేట ప్రాంతీయవైద్యశాలను కేంద్ర బృందం (లక్ష్యా ప్రాజెక్టు)ను బుధవారం సందర్శించారు. ఈ బృందంలో కర్ణాటకు చెందిన డాక్టర్ రాఘవేంద్ర, ఒరిస్సాకు చెందిన లోకముద్రరౌత్‌తో కూడిన ముగ్గురు అధికారు లు ఉన్నారు. వీరు సీమాంక్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ కాన్పులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా ఏటా లక్ష ప్రాజెక్టు కింద కొన్ని ప్రాంతీయవైద్యశాలలను ఎంపిక చేయనున్నారు దీని వల్ల కేంద్రం నంచి అదనంగా నిధులతో పాటు అధునాతకమైన సేవలను అందుతాయి. వీరి వెంట సూపరింటెండెంట్ రాజు తదితర వైద్యులు పాల్గొన్నారు.

గంగ ఒడికి గణపతి

- వినాయకుడికి ఘనంగా వీడ్కోలు
- వైభవంగా నిమజ్జనం



పీలేరు పట్టణంలో భక్త జనసందోహం నడుమ గంగ ఒడికి తరలుతున్న గౌరీ తనయుడు

కడప కల్చరల్/పీలేరు: బొజ్జ గణపతి.. సకల విద్యల విఘ్నేశ్వరుడు.. శివపార్వతుల ముద్దుల తనయుడు.. ఆదిపూజలస్వామి.. ఏకదంతుడు వినాయకుని నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. తల్లి గంగమ్మ ఒడికి తనయుడు గణపతిని చేర్చి మళ్లీ బాద్రపద మాసంలో వచ్చి కటాక్షించాలని ప్రార్థించారు. సమీపంలోని నీటి వనరుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. స్వామిని పందిళ్లలో నుంచి వాహనాలపై చేర్చడానికి ముందు స్థానిక భక్తులకు అన్నదానాలు చేశారు.

- 'జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై.. గణపతి బొప్ప మోరియా.. అనే నినాదాలు, తప్పెట వాద్యాలు, చెక్కభజనలు, బ్యాండుమేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కేరింతల మధ్య కట్టలు తెగిన ఉత్సాహం మధ్య గణపతి నిమజ్జనం జరిగింది. ఈ సందర్భంగా పలుచోట్ల గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూల వేలం పాటలు, ఉట్టికొట్టడం, బాలలకు పోటీలను ఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.
- మూడు రోజులపాటు జిల్లా అంతటా పందిళ్లలో భక్తుల పూజలందుకున్న గణనాథుని విగ్రహాలను మధ్యాహ్నం నుంచి చెరువులు, కాలువలు, కుంటల్లో నిమజ్జనానికి తరలించారు. పీలేరులో భక్తజనసందోహం నడుమ గణేషుడిని నిమజ్జనానికి తరలించారు. కళాకారులు వేషధారణలు, కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.



కోడూరులో గణేశ్ ఊరేగింపులో యువతోత్సాహం



పీలేరులో గణపతి ఊరేగింపులో కేరళ వాయిద్యాలు

కార్డులకు చెల్లుచీటీ

ఆర్‌సీ, లైసెన్సులకు ఇక డిజిటల్ పత్రాలు

కడప వైఎస్‌ఆర్‌సర్కిల్: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభు త్వం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం కార్డులకు చెల్లుచీటి పడనుంది. నూతన విధానంలో కార్డులు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లోనే లైసెన్సు పత్రాలు వాహనదారుడి ఫోన్‌కు పంపనున్నారు. ఆర్సీకి రూ.235 రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

చోదకులు ఇలా చేయాలి

రవాణా శాఖ వెబ్‌సైట్ https: apsrtacitizen. epragathi. org నుంచి ఫారం 6 లేదా 23ను డౌన్‌లోడ్ చేసుకొని ధ్రువ పత్రాన్ని తీసుకోవాలి. లేదా ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఏపీఆర్‌టీఏసిటిజన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాటిని నేరుగా ప్రింట్ తీసుకుని లేదా ఫోన్‌లో భద్రపరచుకుని అధికారులు అడిగినప్పుడు చూపే అవకాశాన్ని కల్పించారు.

దేశంలో ఎక్కడైనా తనిఖీలు.....

దేశం మొత్తం ఒకే డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకువచ్చింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. కార్డులు కాకుండా ఫోన్‌లో భద్ర పరచుకున్న లైసెన్సు, ఆర్సీ పత్రాలను దేశంలో ఎక్కడైనా తనిఖీ సమయంలో అధికారులకు చూపించవచ్చు. ఈ విధానం తనిఖీలకు సులభంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇక కార్డులు ఉండవు

నూతన విధానంలో లైసెన్సు మంజూరు తర్వాత ప్రింటెడ్ కార్డులివ్వరు. ఆన్‌లైన్‌లోనే మాత్రమే పత్రాలు పంపుతారు. వాహనదారుడు ప్రింట్ తీసుకొని తన వద్ద ఉంచుకోవచ్చు. ఫోన్‌లో భద్ర పరుచుకోవచ్చు. అధికారుల తనిఖీ సమయంలో చూపితే సరిపోతుంది. –ఈ.మీరా ప్రసాద్, ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్‌ఆర్ జిల్లా

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో టీచర్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న విజయలక్ష్మి

గాలివీడు : రోడ్డు ప్రమాదంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న విజయలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు గాయపడ్డారు. తోటి ఉపాధ్యాయుల కథనం మేరకు శివలక్ష్మి ఎస్ఎస్ఏ లో శిక్షణ కోసం విజయవాడకు వెళుతుండగా వినుకొండ వద్ద తాను ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురికావడంతో గాయపడింది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు సమాచారం.విషయం తెలుసుకున్న ఆ జిల్లా ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి



మృతి చెందిన నవీన్ రెడ్డి

ములకలచెరువు : ద్విచక్ర వాహనదారుడుని లారీ ఢీకొనడంతో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గాయత్రి కథనం మేరకు... సత్య సాయి జిల్లా తనకల్లు మండలం ఆమడ గురు కు చెందిన నవీన్ రెడ్డి(33) పనుల మీద ములకలచెరువుకు వస్తుండగా కదిరి వైపు వెళ్తున్న పాల లారీ షాది మహల్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ రెడ్డి సంఘటన స్థలంలోని మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు విచారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ



జిల్లా ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు కె.శ్రీనివాసరావు

మదనపల్లె : జిల్లా ఆస్పత్రిలో కేంద్ర బృంద సభ్యులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్‌సీ),విశాఖపట్నం నుంచి వచ్చిన సభ్యులు కె.శ్రీనివాసరావు, సీహెచ్ పాదాలు జిల్లా ఆస్పత్రిలోని అన్ని విభాగాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. మెటర్నటీ, క్యాజువ్యాలిటీ, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, మెడిసిన్ స్టోర్సు, ఐసియు, ఎస్ఎన్‌సీయూ, జనరల్ వార్డులలోని సౌకర్యాలను పరిశీలించారు. అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి అవసరమైన సదుపాయాల వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని మౌలిక సౌకర్యాలు, వైద్య చికిత్సలు పరిశీలించి కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రిత్వశాఖకు నివేదికలు అందజేస్తామన్నారు. దీని ఆధారంగా నీతిఆయోగ్ గ్రేడింగ్ నిర్ణయిస్తుందన్నారు.

ఆరోగ్య సిరి

చిరుధాన్యాలను 'సిరి'ధాన్యాలు అని కూడా పిలుస్తారు.. వీటిని తీసుకుంటే ఆరోగ్యశ్రీమంతులుగా ఉండవచ్చు.. ఇవి ఎన్నో వ్యాధులకు దివ్యౌషధంలా పని చేస్తాయి.. కావున ప్రస్తుతం వీటి వైపు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.. ఈ మార్పు ఎంతో మంచిదని వైద్యులు సైతం చెబుతున్నారు.. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.

- చిరుధాన్యాలతో దరిచేరని రోగాలు
- పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన
- నేడు పులివెందులలో నేషనల్ సైన్స్ సెమినార్
- నేడు జిల్లా స్థాయి, 25న రాష్ట్ర స్థాయి సెమినార్





కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తినే ఆహారంపై అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం బెంగళూరు వారు జాతీయస్థాయిలో నేషనల్ సైన్స్ సెమినార్–2023ను అక్టోబర్‌లో నిర్వహించనున్నారు. ఏటా ఒక్కో అంశంపై సెమినార్ నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం తెస్తున్నారు. కరోనా తరువాత నిర్వహించే ఈ సెమినార్‌లో 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఆర్ డైట్ ఫ్యాడ్' అంశానికి ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలతో ఆరోగ్యసిరి అందుతుందా.. లేక వ్యామోహంతో వాటిని తీసుకుంటున్నారా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ వంటి వ్యాధుల బారిన అనేక మంది పడుతున్నారు. దీంతో చాలా మంది బియ్యాన్ని తగ్గించి చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనిపై విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సెమినార్ నిర్వహిస్తారు. దీని కోసం షెడ్యూల్‌ను ప్రకటించారు.

ఇలా చేయాలి

సెమినార్‌లో పాల్గొనే విద్యార్థులు చిరుధాన్యాల విశిష్టతను, వాటిలో ఉండే పోషకాలు, మినరల్స్, విటమిన్స్, ఏ వ్యాధులకు ఏ ధాన్యాలు తీసుకోవాలి వంటి విషయాలను వివరిస్తూ పోస్టర్స్, చార్ట్స్, పీపీటీ, స్లైడ్స్ రూపొందించి ప్రదర్శించాల్సి ఉంటుంది. ఒక్కో విద్యార్థి ఐదేసి పోస్టర్స్, చార్ట్స్, పీపీటీ, స్లైడ్స్‌లను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రూపొందించాల్సి ఉంటుంది. వాటిలో ఉత్తమమైన వాటిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేస్తారు. వాటిని తయారు చేసిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అన్ని స్థాయిల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ కూడా చక్కటి ప్రతిభ కనబరిస్తే గోల్డ్‌మెడల్, నగదు బహుమతిని ప్రదానం చేస్తారు.

నేడు జిల్లా స్థాయి పోటీలు

పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటడానికి సమాయత్తం అవుతున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే సెమినార్‌లో పాల్గొనే ఔత్సాహికులకు సైన్స్ ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. చిరు ధాన్యాలతో ప్రయోజనాలు, ఆరోగ్య పరిరక్షణకు ఏ విధంగా దోహదం చేస్తాయనే విషయంపై శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి 21వ తేదీ గురువారం పులివెందులలోని జెడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో పులివెందుల ఫుడ్ టెక్నాలజీ కళాశాల నుంచి న్యాయ నిర్ణేతలు వచ్చి విద్యార్థుల ప్రతిభాపాటవాలను పరిశీలించి ఒక్కరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 25వ తేదీ విజయవాడలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించనున్నారు. అక్కడ విజేతలుగా నిలిచిన వారికి సీల్డ్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని అందించి సన్మానించనున్నారు.

సెమినార్‌కు సమాయత్తం



నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఏటా ఒక్కో అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది చిరుధాన్యాలపై జాతీయస్థాయి సెమినార్ నిర్వహిస్తోంది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది. దీంతో విద్యార్థులను సెమినార్‌కు సన్నద్ధం చేసేందుకు సైన్సు ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చాం. చిరుధాన్యాలపై సమస్త సమాచారాన్ని విద్యార్థులకు అందజేసి చక్కటి ప్రదర్శన ఇప్పిస్తున్నాం. వారు జాతీయస్థాయిలో రాణించడానికి శిక్షణ ఇస్తున్నాం.

– బి.మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కడప

విద్యార్థి మృతికి కారకుడైన ఆటో డ్రైవర్ అరెస్టు

మదనపల్లె : నిర్లక్ష్యంగా ఆటో నడిపి పాలిటెక్నిక్ విద్యార్థి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి టూ టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. ఈనెల 18వతేదీ సోమవారం వినాయకచవితి సందర్భంగా వినాయకుని విగ్రహాలను చూసేందుకు ఎస్టేట్ బాలాజీనగర్‌కు చెందిన రమణ,ధనమ్మల కుమారుడు పాలిటెక్నిక్ విద్యార్థి డి.అరుణ్(21) అదే ప్రాంతానికి చెందిన అఖిల్ (21)తో కలిసి ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వచ్చారు. విగ్రహాలను చూసిన అనంతరం తిరిగి ఇంటికి వెళుతుండగా బాపూజీ పార్కువద్ద గౌతమినగర్‌కు చెందిన రమేష్ బాబు కుమారుడు రెడ్డికిషోర్ (20) మద్యం మత్తులో ఆటోను వేగంగా నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో అరుణ్, అఖిల్ ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పాలిటెక్నిక్ విద్యార్థి అరుణ్ మృతి చెందాడు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసిన టుటౌన్ పోలీసులు బుధవారం నిందితుడైన ఆటో డ్రైవర్ రెడ్డికిషోర్‌ను అరెస్టు చేసి రిమాండుకు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు సీ.ఐ తెలిపారు.

భర్త వేధింపులతో ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన మమత

మదనపల్లె : భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టుగ్రామం మంద్యంవారిపల్లెకు చెందిన చంద్రశేఖర్ భార్య డి.మమత(20) బుధవారం ఇంటి వద్ద పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ... తమ కుమార్తెకు 2022 ఫిబ్రవరిలో కట్నకానుకలతో అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి ప్రేమవివాహం జరిపించామన్నారు. పెళ్లి తర్వాత తాను చదువుకోవాలని చెప్పడంతో మరో రూ.2లక్షలు ఇచ్చామన్నారు. అయితే ప్రస్తుతం కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడన్నాడు. రూ.12లక్షలు ఇచ్చి ట్రాక్టర్ కొనిస్తే మమతతో కాపురం చేస్తానని, లేకపోతే విడాకులు ఇస్తానని వేధిస్తున్నాడన్నారు. భర్త వేధింపులు భరించలేకే తమ కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని చెప్పారు.

కుటుంబ సమస్యలతో మరో ఇద్దరు..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారు. బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ బందార్లపల్లెకు చెందిన జి.నారాయణస్వామి(24) కుటుంబసమస్యలతో మంగళవారం రాత్రి ఎలుకల మందు తాగాడు. అదేవిధంగా మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన గంగులప్ప కుమారుడు వెంకటరమణ(45) కుటుంబసమస్యలతో ఎలుకల మందు తాగాడు. ఆయా ఘటనల్లో కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక టూర్లు

మైదుకూరు (వైఎస్‌ఆర్ జిల్లా) : మైదుకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక టూర్లు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ హసీనా బేగం, డిపో ఎస్‌టీఐ మంజుల, ఎంఈఓ నరహరిశర్మ తదితరులు విడుదల చేశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ మైదుకూరు డిపో నుంచి కోరిన రోజుల్లో, శని, ఆదివారాల్లో కానీ ఈ ప్రత్యేక టూర్లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. టూర్ల ప్యాకేజీ వివరాలను ఆయన తెలిపారు. మైదుకూరు బస్టాండ్ నుంచి బస్సు ఉదయం 7 గంటలకు బయల్దేరి, దేవుని కడప, ఒంటిమిట్ట, నందలూరు సౌమ్యనాథాలయం, తాళ్లపాక క్షేత్రాలను దర్శించుకుని సాయంత్రం 6 గంటలకు తిరిగి మైదుకూరు చేరుకుంటుందన్నారు. మైదుకూరు బస్టాండ్ నుంచి ఉదయం 7 గంటలకు మరో బస్సు బయల్దేరి అల్లాడుపల్లె, సంగమేశ్వర దేవాలయం, వేంపల్లె గండి క్షేత్రం, దేవుని కడప క్షేత్రాలను దర్శించుకుని సాయంత్రం 6 గంటలకు మైదుకూరు చేరుకుంటుందన్నారు. ఇంకొక టూరులో మైదుకూరు బస్టాండ్ నుంచి ఉదయం 7 గంటలకు బయల్దేరి గండికోట, మైలవరం డ్యాం సందర్శించుకుని సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ టూర్లలో ఎక్స్‌ప్రెస్ బస్సుకు పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.300, సూపర్ లగ్జరీ బస్సు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 టికెట్ ఉంటుందని డీఎం వివరించారు. ఈ టూర్ల కోసం బస్సులను బుక్ చేసుకునేవారు 9959225781 (డీఎం), 9701145249 (మార్కెటింగ్) 7382865848 (టీఐ)లకు సంప్రదించాలని కోరారు.

చోరీ కేసులో బాలురు అరెస్ట్

రూ. 3.50 లక్షలు నగదు, 17.7 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : ఆ ఇంట్లో దొంగతనం జరిగిన తీరు చూసి ఇది పక్కా ప్రొఫెషనల్ దొంగల పనేనని పోలీసులు భావించారు. ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే ఇంటికి కన్నం వేసింది ఇద్దరు మైనర్ బాలురు అని తెలియడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని గోకుల్‌నగర్‌లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు మైనర్ బాలలను పోలీసులు అరెస్ట్ చేశారు. హోటల్ నిర్వాహకుడు బైసాని సుబ్బరామయ్య ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నిందితులను నడింపల్లెలోని పాత సమితి కార్యాలయం సమీపంలో అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, టూ టౌన్ ఎస్ఐ రెడ్డిసురేష్‌లు అరెస్ట్ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. గోకుల్ నగర్‌లోనే గాక ఈ నెల 15న రాత్రి శ్రీరాములపేటలోని హోటల్‌లో కూడా వీరు చోరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ రెండు కేసులకు సంబంధించి వారి వద్ద నుంచి రూ.3. 50 లక్షల నగదు, 17.7 తులాల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి బాలల సంరక్షణా కేంద్రానికి తరలించనున్నట్లు సీఐ తెలిపారు. చోరీ కేసు ఛేదించిన వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, టూ టౌన్ ఎస్ఐ రెడ్డిసురేష్, సిబ్బందిని ఏఎస్పీ ప్రేరణాకుమార్ అభినందించారు.

పిల్లల నడవడికపై దృష్టి సారించండి

చోరీ కేసులో అరెస్ట్ అయిన బాలురు 16,13 ఏళ్లలోపు వారే. పిల్లల ప్రవర్తన, ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారనే దానిపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. చిన్న వయసులోనే పిల్లలు పెద్ద పెద్ద నేరాలకు పాల్పడి వారి బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాజంపేట : మండలం లోని బ్రాహ్మణపల్లి ప్రధాన రహదారి వద్ద బుధవారం రాత్రి రామచంద్ర(55) అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. మృతుడు పుల్లంపేట మండలం లోని వైఎస్ఆర్ కాలనీ వాసిగా గుర్తించారు. ఈయన భార్యతో గొడవ పడి మనస్తాపంతో ఉరివేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై రాజంపేట రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

కలికిరి : పట్టణ పరిధిలోని ఇందిరమ్మకాలనిలో సయ్యద్ కరీం నివాసంలో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని బియ్యం, బట్టలు, వాటర్‌ట్యాంక్, వంట సామగ్రి కాలిపోయాయి.. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, వార్డు సభ్యుడు ఖాదర్ బాషా తమ వంతు సాయంగా బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదంపై రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వీఆర్‌ఓ వెంకటేష్ నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ముస్లిం జేఏసీ వ్యవస్థాపకులు హనీఫ్, పెయింట్ షాపు ఫయాజ్, షామీర్ ఖాన్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ వంతు సాయం అందజేశారు.

గుంతను తప్పించబోయి.. కిందపడి



రాజేష్ మృతదేహం

కొండాపురం : మండల పరిధిలోని పెంజి అనంతపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుంతను తప్పించబోయి స్కూటీ అదుపుతప్పి కింద పడిన ఆర్. రాజేష్(30) మృతి చెందాడు. కొండాపురం ఎస్ఐ యోగేంద్ర కథనం మేరకు చౌటిపల్లె గ్రామానికి చెందిన ఆర్. శ్రీరాములు కుమారుడు ఆర్ రాజేష్ తాడిపత్రి నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా పెంజి అనంతపురం ఎస్సీ కాలనీ వద్ద జాతీయ రహదారిలో గుంత తప్పించబోయి కింద పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. వెంటనే 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

లారీని బైక్ ఢీకొని..

మండల పరిధిలోని ఏటూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యలటూరు హరికృష్ణ(27) మృతి చెందాడు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ మోహన్ కథనం మేరకు వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం యు.రాజుపాలెం గ్రామానికిచెందిన యలటూరు హరికృష్ణ భారతి సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్వగ్రామం నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గం కొత్తపల్లె గ్రామంలోని అత్తారింటికి బైక్‌లో బయలుదేరాడు. ఏటూరు గ్రామం వద్ద ముందు వెళుతున్న లారీ సడెన్‌గా ఆగింది. హరికృష్ణ వేగాన్ని అదుపుచేసుకోలేక లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆగి ఉన్న అదే లారీని మరో కారు ఢీకొంది. అయితే కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు నుజ్జునుజ్జు అయింది. ఈఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిమజ్జనానికి వెళ్లి యువకుడి మృతి

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామంలో గణేశుని నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పామిడిసునీల్ (18) అనే యువకుడు నిమజ్జనం చేయక ముందే సునీల్ వరికుంట్ల చెరువులోకి దూకి పూడికలో ఇరుక్కుపోయాడు. ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో అక్కడే ఉన్న యువకులు 20 నిమిషాలు పోరాడి సునీల్‌ను బయటికి తీశారు. అప్పటికే యువకుడు మృతిచెందాడు. కాశినాయన పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రుణ విస్తరణ



లబ్ధిదారుడికి ఆటో తాళాన్ని అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రుణ విస్తరణ కార్యక్రమం స్థానిక హరిత హోటల్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ రాకేష్ కశ్యప్, నాబార్డ్ సిజీఎం ఎంఆర్ గోపాల్,నాబార్డ్ డీజీఎం రాజీవ్ కుమార్ శర్మ లు హాజరై మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కడప జిల్లాలో 61 శాఖలతో 5240 కోట్లతో అధిక వ్యాపార వాటాతో కలిగి ఉందని తెలిపారు. రుణాలలో 2526 కోట్ల వ్యాపార లావా దేవీలు నిర్వహిస్తూ పంట రుణాలు ,స్వయం సహాయక బంద రుణాలు, వివిధ రకాల వ్యాపార రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ సాధించిన అభివద్ధి, లభించే సేవలను రుణ సదుపాయాల గురించి ఖాతాదారులకు తెలియజేశారు. దాదాపు 160 మంది ఖాతాదారులకు గృహ వాహన వ్యాపార, వ్యవసాయతర రుణాలు 5 కోట్ల 20 లక్ష లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప రీజినల్ శాఖ బ్రాంచ్ మేనేజర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు శ్రేయోభిలాషులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారన్నారు.

పొలంలో రోడ్డు వేశారని ఫిర్యాదు

రామాపురం : తన పొలంలో అక్రమంగా రోడ్డు వేస్తున్నారని మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన రైతు మదన్‌మోహన్‌రెడ్డి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 40 సెంట్లలో నీటి ఆధారంతో పొలం సాగు చేసుకుంటున్నానని, అదే గ్రామానికి చెందిన రెడ్డప్పరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటనారాయణరెడ్డిలు దౌర్జన్యంగా చెరువును ఆక్రమించి, తమ పొలంలో రోడ్డు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై అడిగితే దుర్భాషలాడుతున్నారని తెలిపారు. ఆ చెరువు నీరు నా పొలానికి వచ్చేదని, వీరు రోడ్డు వేయడంతో రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

మద్యం దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి షేక్ అయేషాబేగం

మదనపల్లె : పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, రెస్టారెంట్, బార్స్‌ను బుధవారం అన్నమయ్యజిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి షేక్ ఆయేషాబేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం దుకాణాల నిర్వహణపై, సమయపాలన పాటించాలని సేల్స్‌మ్యాన్‌కు పలుసూచనలు ఇచ్చారు. మద్యం దుకాణాలు ఉదయం 11 గంటలకు తెరచి, రాత్రి 9 గంటలకు మూసివేయాలన్నారు. రికార్డుల నిర్వహణ కోసం గంట కేటాయించామన్నారు. ఆహారం తయారీ కోసం రికార్డెడ్‌గా ఓ గంట ముందు బార్లు తెరుచుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు





కడప అర్బన్ : కడప రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళల మృతదేహాలున్నాయి. ఆచూకీ తెలిసిన వారు నేరుగా వచ్చి తమను సంప్రదించాలన్నారు. ఈ వివరాలను బుధవారం కడప ప్రభుత్వ వైద్యకళాశాల ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

లంబోదరుడి లడ్డూ ప్రసాదానికి క్రేజ్

వేలంలో అధిక ధరలకు దక్కించుకున్న భక్తులు



పోరుమామిళ్ల : వేలంలో దక్కించుకున్న లడ్డూను తీసుకెళుతున్న యనమల చలమయ్య దంపతులు



అట్లూరు : కమలకూరులో లడ్డూను తీసుకెళుతున్న సిద్దుభాస్కర్‌రెడ్డి



రాజంపేట : రూ. 1,45,000 లక్షలకు లడ్డును దక్కించుకున్న కోవూరు ఈశ్వరయ్యనాయుడు

రాజంపేట రూరల్ : వినాయక చవితి సందర్భంగా మండల పరిధిలోని అత్తిరాల కమ్మపల్లి గ్రామంలో నిర్వహించిన గణేష్ వేలం పాటలో లడ్డును కోవూరు ఈశ్వరయ్యనాయుడు రూ. 1,45,000 లకు దక్కించుకున్నారు. తన కుమారులైన కోవూరు శ్రీకాంత్, కోవూరు రజనీకాంత్, కోవూరు చరణ్‌లతో కలిసి ఊరేగింపుగా గృహానికి తీసుకెళ్లి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. వెంకటరాజంపేట గ్రామంలో నిర్వహించిన వేలం పాటలో ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న ఉద్దండపు వెంకటసుబ్బయ్య రూ. 1,05,000 లకు దక్కించుకున్నారు.

పోరుమామిళ్ల : వైఎస్సార్ జిల్లా గానుగపెంట పంచాయతీలోని ఎనమల నాగాయపల్లెలో బుధవారం వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. ఎనమల చలమయ్య, నాగమణి దంపతులు వేలంలో రూ. 1,85,000లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈసంవత్సరం బద్వేలు నియోజకవర్గంలోనే ఇది అత్యంత అధిక పాటగా తెలుస్తోంది.అలాగే స్వామి దగ్గర ఉంచిన కలశం పాత్రను కూడా రూ. 41,000లతో సొంతం చేసుకున్నారు. నిర్వాహకులు చలమయ్య, నాగమణి దంపతులను సత్కరించారు.

- మండలంలోని రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లెలో బుధవారం జరిగిన వినాయక లడ్డూను వేలంలో కలవకూరి బక్కయ్యగారి శివకుమార్ రూ.1,30,000లకు సొంతం చేసుకున్నారు.
- పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి గుడిలో వినాయక లడ్డూను పాలగిరి శ్రీనివాసులు దంపతులు రూ.53 వేలతో దక్కించుకోగా, జడపోలు శ్రీరాంనగర్ వీధిలో వేలంలో రూ. 36 వేలకు గోగుల బాలమ్మ సొంతం చేసుకున్నారు.

అట్లూరు : వినాయకచవితి సందర్భంగా మండలంలోని కమలకూరు గ్రామంలో స్వామివారి లడ్డును వేలంపాటలో రూ.1.80 లక్షలకు సిద్దుభాస్కర్‌రెడ్డి దక్కించుకున్నారు. మన్యంవారిపల్లె గ్రామంలో సచివాలయాల మండల కన్వీనర్ మన్యం మల్లికార్జునరెడ్డి రూ.80 వేలు, బోడిశెట్టిపల్లె గ్రామంలో పొన్నవోలురామకృష్ణారెడ్డి రూ. 1.50 లక్షలకు లడ్డూలను దక్కించుకున్నారు.